క్లుప్తంగా...

నేడు షేక్‌పేట్‌లో ఐదు వేల మందితో బతుకమ్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

గోల్కొండ: మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల తన పాలనలో తెలంగాణను అభివృద్ధి చేయగా ప్రస్తుత సీఎం రెండేళ్లలోపు తన పాలనలో రాష్ట్రాన్ని దివాలా తీయించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం షేక్‌పేట్‌లో ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రావణ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. మరుగున పడ్డ తెలంగాణ పండుగలను పునర్జీవం పోసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. నేడు షేక్‌పేట్‌లోని సక్కూబాయి స్కూల్ ప్రాంగణంలో ఐదు వేల మంది మహిళలతో మహా బతుకమ్మ నిర్వహిస్తున్నామన్నారు. బతుకమ్మలో పాల్గొన్న ప్రతి మహిళకు చీర, కుంకుమబోట్టు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షుడు మసీయుద్దీన్, బీఆర్ఎస్ మైనార్టీ రాష్ట్ర నాయకులు ముజీబ్, ఆజామ్ అలీ, బీఆర్ఎస్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ తదితరులున్నారు.

మీరాలంమండిలో ఖజానా పంపిణీ



చార్మినార్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో పూజలు కొనసాగుతున్నాయి. మీరాలంమండి అమ్మవారు ప్రతిరోజు ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. మహాలక్ష్మి అవతరణ పూజల సందర్భంగా భక్తులకు ఖజానా పంపిణీ జరిగింది. సిల్వర్ కాయిన్స్ పై అమ్మవారి చిత్ర పటంతో రూపొందించిన ఖజానాను ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య భక్తులకు అందజేశారు.

సుల్తాన్‌బజార్ పీఎస్‌ను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు



సుల్తాన్‌బజార్: ఓరియంటేషన్ ట్రైనింగ్ కోసం నలుగురు ఐపీఎస్ అధికారులు అభిజిత్ సిరోహి, తను సింగ్, రాణు గుప్తా, శివం శనివారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు వివిధ కేసులపై అధ్యయనం చేశారు. పోలీస్ వ్యవస్థలో కేసులు ఎలా పరిష్కరిస్తారు అనే విషయాలను పరిశీలించారు. వారికి సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ నరసింహ, ఇతర ఎస్ఐలు కేసుల వివరాలను దర్యాప్తు విషయాలపై చర్చించారు.

ఊరెళ్తున్నారా..జాగ్రత్త!



నాగరాజు

సంతోష్‌నగర్: దసరా పండుగకు స్వగ్రామానికి వెళ్లే ప్రజలు తమ ఇంట్లోని విలువైన వస్తువులు, నగదును బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ జి.నాగరాజు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ..ఇంటి తలుపులు ముందు చెప్పులు ఉంచడం, బయట గేట్‌కు లోపల నుంచి తాళం వేయడం.. ఇంటి ముందు గదిలో లైట్ వేసి ఉంచడం..పేపర్ బాయ్, పాల వారికి రావొద్దని చెప్పాలన్నారు. ఊరికి వెళ్లేముందు నమ్మకమైన వారికి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. అలాగే బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే మహిళలు తమ ఆభరణాలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

దూద్‌బౌలి: డెడ్ డ్రాప్ పద్ధతిలో హైడ్రోపోనిక్ గంజాయి తెప్పించుకుంటూ యువకులకు విక్రయిస్తున్న గంజాయి పెడ్లర్‌ను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చార్మినార్ పోలీసులతో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 45 గ్రాముల హైడ్రోపోనిక్ గంజాయి, మరో 2 కిలోల గంజాయితోపాటు యాక్టీవా, రూ.లక్షా 3వేలను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ సన్ సిటీ ప్రాంతంలోని పీఅండ్ టీ కాలనీకి చెందిన అలీ బిన్ హమీద్ (46) కొంతకాలం క్రితం నుంచి గంజాయి దందా చేయటం మొదలు పెట్టాడు. మెయిల్‌కు గంజాయి కావాలని మెసేజీలు పెట్టేవాడు. ఆ తరువాత అవతలి వ్యక్తి గంజాయిని పార్సిల్ రూపంలో పంపించి దానిని ఎక్కడ పెట్టిందన్న విషయాన్ని వాట్సాప్ లొకేషన్ ద్వారా హమీద్‌కు తెలియచేసేవాడు. దీనిని చిన్నచిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసి అమ్మేవాడు. సమాచారాన్ని సేకరించిన సీఐ బాలస్వామి, ఎస్ఐ మనోజ్ కుమార్, చార్మినార్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ గౌడ్ తోపాటు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి, అదుపులోకి తీసుకున్నారు.



జలమయమైన జియాగూడ నుంచి కాశీబుగ్గ ఆలయం రహదారి



13 అడుగుల ఎత్తులో వరద నీటి ప్రవాహం



పురానాపూల్‌లో నీట మునిగిన శివాలయం

మూసీ ఉగ్రరూపం!

వరదలతో బస్తీలు జలమయం | భయం గుప్పెట్లో ప్రజలు | సహాయక చర్యల్లో అధికారులు



మూసీ వరదలతో సగానికి మునిగిన పురానాపూల్ వంతెన



ధూల్‌పేట మూసీ ఒడ్డున పర్యటిస్తున్న నాంపల్లి తహసీల్దార్ మహ్మద్ నయిముద్దీన్



పురానాపూల్ చౌరస్తాలో మూసీ వరదలను చూస్తున్న ప్రజలు, చౌరస్తా వద్ద రద్దీ



జుమ్మేరాత్ బజార్ వద్ద..ఏఎంఓహెచ్ వెంకటరమణ, తహసీల్దార్ నయిముద్దీన్



పురానాపూల్ మూసీ ఒడ్డున ఉన్న నిర్వాసితులు

అబిడ్స్: మూసీ వరదలతో వేలాది కుటుంబాలు నరకయాతనను అనుభవించాయి. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ గేట్లు వాటర్ బోర్డు అధికారులు ఎత్తివేయడంతో మూసీ ఉగ్రరూపం చూపింది. గోషామహల్ నియోజకవర్గంలోని పురానాపూల్, చంద్రకిరణ్‌బస్తీ, జగన్నాథ్ ద్వారా, ఉప్పలమ్మ బస్తీ, ఎంజే బ్రిడ్జ్, అంబేద్కర్‌నగర్, దేవీనగర్, జుమ్మేరాత్ బజార్ ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వరదనీరు రావడం ప్రజలు అవస్థల పాలయ్యారు. శుక్రవారం రాత్రంతా వేలాది మంది తమ అరచేతిలో ప్రాణాలను పెట్టుకొని జీవనం గడిపారు.

జీహెచ్ఎంసీ, ఇతర అధికారుల చేయూత..

ఈ బస్తీలు, మూసీ ఒడ్డున నివసించే పేద ప్రజలకు జీహెచ్ఎంసీ అబిడ్స్–14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఉమాప్రకాష్, ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణ, నాంపల్లి తహసీల్దార్ మహ్మద్ నయిముద్దీన్, గోషామహల్ ఏసీపీ సుదర్శన్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఇతర అధికారులు వారికి చేయూతనందించారు. అర్ధరాత్రి వేళ భయాందోళనలో ఉన్న ప్రజల్లో గోడేకబర్‌కు తరలించి వారికి షల్టర్ ఇచ్చారు.

వాటర్‌బోర్డు నిర్లక్ష్యంతోనే అవస్థలు..

హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతోనే వేలాది మంది మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అవస్థలకు గురయ్యారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రజలకు ఎలాంటి సమాచారం అందజేయకుండా ఒకేసారి ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల గేట్లను ఎత్తివేయడంతో స్థానికులు తీవ్ర అవస్థలకు గురయ్యారు.

బాధితులను ఆదుకోండి: ఎమ్మెల్యే రాజాసింగ్

వేలాది మంది బాధితులు నిరాశ్రయులయ్యారని, వారిని ఆదుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ లాల్‌సింగ్ డిమాండ్ చేశారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో వారు శనివారం పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ..మూసీ ఒడ్డున ఉన్న వేలాది కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

జియాగూడ మూసీ పరీవాహక ప్రాంతాలు మునక..

జియాగూడ: జియాగూడ మూసీ పరీవాహక ప్రాంతాలు మునిగాయి. 100 ఫీట్ల జాతీయ రహదారి, ఇక్బాల్‌గంజ్, దుర్గానగర్, సంత్ ఉదాసిన్ అకాడ, హనుమాన్ ఆలయం, కావీబుగ్గ ఆలయానికి వెళ్లే రహదారి వరదలకు పూర్తిగా మునిగాయి. కేశవస్వామినగర్, దుర్గానగర్, ఇక్బాల్‌గంజ్ తదితర ప్రాంతాల వారు మూసీనది ఒడ్డున 20 ఏళ్లుగా ఉంటున్నారు. నిన్న అర్ధరాత్రి ప్రాంతం మూసీ వరదలు పొంగి గుడిసెలను ముంచ్చాయి. ఏ మాత్రం ప్రాణాపాయం జరగనప్పటికీ గుడిసెల్లో బట్టలు, నిత్యావసర సరుకులు తడిశాయి. ఇప్పటి వరకు ప్రభుత్వ అధికారులు ఎవరు రాలేదని ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

పురానాపూల్ చౌరస్తా, కేఎస్‌నగర్ చౌరస్తాలలో బైపాస్ రోడ్డు బంద్..

బైపాస్ జాతీయ రోడ్డు పూర్తిగా మూసీ వరదలతో మునగడంతో రహదారిని పురానాపూల్ చౌరస్తా, కేఎస్‌నగర్ చౌరస్తాలలో బారికేడ్లు పెట్టి రహదారిని మూసీవేశారు. దీంతో జియాగూడ రహదారిలో తీవ్ర ట్రాఫిక్ నెలకొంది.

పాతబస్తీ పరిధిలో..

చార్మినార్/దూద్‌బౌలి: పాతబస్తీ పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతాలన్నీ నీట మునిగాయి. కిషన్‌బాగ్‌లోని అసద్‌బాబా నగర్, మహమూద్‌నగర్ తదితర బస్తీలకు చెందిన 100కు పైగా కుటుంబాలను కిషన్‌బాగ్ లోని హైదరాబాద్ ఫంక్షన్ హాల్ కు తరలించారు. పురాణాపూర్ హిందూ శ్మశాన వాటిక పూర్తిగా నీట మునిగింది. రెండు రోజులుగా ఇక్కడ అంత్యక్రియలకు అవకాశలు లేకుండా పోయింది. బాధితులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇతర శ్మశాన వాటికలను ఆశ్రయించారు.

ఎప్పుడూ ఇంత వరదలు రాలేదు



మూసీనది ఒడ్డున 20 ఏళ్లుగా ఉంటున్నాం. ఎప్పుడూ ఇంత వరదలు రాలేదు. వరదలు పెరుగుతుండడంతో బిక్కు బిక్కుమంటున్నాం. ప్రభుత్వ అధికారులు ఎవరు రాలేదు. అర్ధరాత్రి నీరు మా గుడిసెలకు రావడంతో బైపాస్ రోడ్డు మీదకు వెళ్లాం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వరదల బాధితులకు రూ.10 వేల చొప్పున సహాయం చేసింది.

– రంగన్న, కేశవస్వామి, మూసీ ఒడ్డు ప్రాంత వాసి

నిత్యావసర వస్తువులు తడిసిపోయాయి



పురానాపూల్ నుంచి కేశవస్వామి నగర్ వరకు 500లకు పైగా గుడిసెలు ఉన్నాయి. వరద నీరు గుడిసెల్లోకి రావడంతో నిత్యావసర వస్తువులు తడిసిపోయాయి. గుడిసెల్లోని నీరు దిగినప్పటికీ బురదమయంగా మారాయి. ప్రభుత్వ అధికారుల నుంచి ఎలాంటి సహాయం నేటికీ లభించలేదు.

– సుంకన్న, మూసీఒడ్డు ప్రాంత వాసి

నీట మునిగిన నయాపూల్ ఢిల్లీ దర్బార్ మైసమ్మ..

పురానాపూల్ నుంచి వరద ప్రవాహం హైకోర్టు నయాపూల్ ద్వారా సాలార్జంగ్ బ్రిడ్జి వైపు ఉధృతంగా వెళ్తుంది. ఇక నయాపూల్ బ్రిడ్జి వద్ద మూసీ నదిలో ఉన్న ఢిల్లీ దర్బార్ మైసమ్మ ఆలయం పూర్తిగా మునిగిపోయింది. అలాగే సాలార్జంగ్ మ్యూజియం ఎదురుగా మూసీ నదిలోని ఆలయాల సైతం నీట మునిగాయి.



మునిగిపోయిన ఇక్బాల్ గంజ్ నుంచి బైపాస్ రోడ్డు



బిక్కు బిక్కుమంటున్న కేశవస్వామినగర్ మూసీ పరీవాహక గుడిసె వాసులు



ధూల్‌పేట మూసీ ఒడ్డున పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, డీసీ ఉమాప్రకాష్



ఎంజే బ్రిడ్జి వద్ద..గోషామహల్ ఏసీపీ సుదర్శన్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, కార్పొరేటర్ లాల్ సింగ్

స్వర్ణకారుల సంక్షేమానికి కృషి



చార్మినార్: స్వర్ణకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరు రాఘవాచారి అన్నారు. హైదరాబాద్ జిల్లా స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సందర్భంగా చార్మినార్‌లోని చార్ కమాన్ భవన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్ జిల్లాకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గం జిల్లాలోని స్వర్ణకారుల సంక్షేమానికి పనిచేయాలన్నారు. గత నెల రాష్ట్ర స్వర్ణకార సంఘం అనుబంధంగా ఏర్పడిన హైదరాబాద్ జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు భీష్మాచారి, సంఘ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్‌తో కలిసి రాఘవాచారి సమక్షంలో చార్ కమాన్ స్థానిక స్వర్ణకార సంఘ భవనంలో జిల్లా కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. వీరితో పాటు కోశాధికారిగా శ్రీధర్ చారి, ముఖ్య సలహాదారుడిగా సుధాకర్ చారి, గౌరవ సలహాదారుడిగా చక్రపాణి, సలహాదారుడిగా శివయ్య, ఉపాధ్యక్షులుగా నారాయణాచారి, ఏకేకె రాజనర్సింహ్మయ్యాచారి, జగన్మోహన్ రావ్, ఆర్గనైజింగ్ సెక్రెటరిగా జగదీశ్వర్ చారి, జాయింట్ సెక్రెటరిగా ప్రశాంత్ చారి, కార్యదర్శిగా శ్రీహరి చారి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సమావేశంలో స్వర్ణకార సంఘ అధ్యక్షుడు ఆంజనేయాచారి, ప్రధాన కార్యదర్శి వేణు గోపాలాచారి, కోశాధికారి శ్రీధర్ చారి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

యాకుత్‌పురా: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ అన్నారు. చందూలాల్ బేలా ప్రభుత్వ సూరాజ్‌భాన్ ప్రసూతి ఆసుపత్రిలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ వైద్య శిబిరంలో హైదరబాద్ జిల్లా హాస్పిటల్ సర్వీసేస్ ప్రోగాం అధికారి డాక్టర్ సూర్యశ్రీ, సూరాజ్‌భాన్‌ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్ఎంఓ డాక్టర్ రజిత, వైద్యాధికారులు పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

చాంద్రాయణగుట్ట: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బోయ నగేష్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన జంగమ్మెట్‌కు చెందిన ఘన్‌శ్యామ్‌కు మంజూరైన రూ.4.5 లక్షల ఎల్ఓసీ చెక్కును శనివారం ఆయన అందజేశారు. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించి, మంత్రి పొన్నం ప్రభాకర్ సీఫార్సుతో వెంటనే ఎల్ఓసీ మంజూరు కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బాధితుడు ముఖ్యమంత్రితో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, బోయ నగేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గౌలిపురా: గౌలిపురా హనుమాన్‌నగర్ ఫేజ్–2లో ఈ నెల 28న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నల్ల పోచమ్మ ఆలయం, రెనోవా సెంటరీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

బతుకమ్మ సంబరాలు

అబిడ్స్: చాపల్ రోడ్డులోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ..తెలంగాణ ప్రత్యేకతను ప్రతిబింభించే ప్రముఖ పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎల్ రాజు, కళాశాల కరస్పాండెంట్ కె.కృష్ణారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు రాకేష్‌రెడ్డి, ఆర్.ప్రదీప్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎ.వినయ్‌బాబు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఆకుల రమేష్, డైరెక్టర్ అకాడమిక్ డాక్టర్ వైవిఎస్.ప్రగతి, డేటాసైన్స్ విభాగాధిపతి డాక్టర్ వైదేహీ పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ సంస్కృతికి ప్రతీక..

గన్‌ఫౌండ్రీ: బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింభిస్తుందని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో భాషా, సాంస్కృతిక శాఖ, రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెడ్డి జాగృతి నాయకులు వసంతరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సాంస్కృతిక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



డీఎంహెచ్ఓ కార్యాలయంలో..

వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో..

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ ఇబ్రహీంబాగ్‌లోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ సంబరాల్లో ఇంజినీరింగ్ విద్యార్థినులు ఆడిపాడారు. కళాశాల ప్రొఫెసర్లు, ఉద్యోగులు వారితో కలిసి సందడి చేశారు.



రవీంద్రభారతిలో..



బతుకమ్మలతో స్టాన్లీ కళాశాల డైరెక్టర్ అనురాధ, ప్రొఫెసర్లు, అధ్యాపకులు



వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



గోల్కొండ: ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లాయన్స్ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ వారు కళాశాలలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. రాఘవరెడ్డి మాట్లాడుతూ..వివిధ ప్రైవేటు ఆసుపత్రుల వారు ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా తమ కళాశాలలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం వారి సేవా దృక్పథానికి నిదర్శనమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామలింగారెడ్డి, డా.అవదాని, డా. మాధవీలత, ఎన్ఎస్ఎస్ అధికారి డా. రమ్యశ్రీ, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ కో ఆర్డినేటర్ డా. నీలి రమేష్ పాల్గొన్నారు.